www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 90 | 15-9-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



## భారత వైవిధ్యం విందులోనూ కనిపించాలి

- బ్రిక్స్ శాకాహార విందు వివాదంపై ఒవైసీ స్పందన
- ఆహార అలవాట్లలోనూ దేశ వైవిధ్యం ప్రతిబింబిస్తుందని వ్యాఖ్య
- డిజిటల్ కరెన్సీపై స్పష్టత లేదని విమర్శ
- చైనా సరిహద్దు చర్చల్లో పారదర్శకతపై ప్రశ్న

4

## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో భద్రతా లోపం..



ఢిల్లీ ఎయిర్‌పోర్టులో భద్రతా లోపం బయటపడింది. సరైన ఇమ్మిగ్రేషన్ అనుమతులు లేకుండానే ముగ్గురు విదేశీయులు దేశం విడిచివెళ్లి పోయారు. దీంతో మరోసారి మన భద్రతా ప్రమాణాలపై చర్చ జరుగు తోంది. ఇటలీకి చెందిన ముగ్గురు పౌరులు ఇండియాలో పర్యటించారు.

4

## ఉగ్రవాది మసూద్ అజార్‌ను పట్టిస్తే రూ.70 లక్షల రివార్డు

- పాకిస్థాన్ నయా నాటకం
- ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టు ముప్పు తప్పించుకునేందుకు రివార్డు పెంపు
- ఎఫ్ఐఏ 'రెడ్ బుక్' మోస్ట్ వాంటెడ్ జాబితాలో జైషే మహ్మద్ అధినేత పేరు

4



# ఖైరతాబాద్‌లో కొలువుదీరిన బడా గణేశ్



## 70 అడుగుల పంచముఖి సంకటహర మహాగణపతి

- గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతుల తొలిపూజ
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- కండువా.. యజ్ఞోపవీతం సమర్పించిన పద్మశాలి సంఘం
- తొలిరోజే పోటెత్తిన భక్తులు.. భారీ పోలీసు బందోబస్తు



వినాయక చవితి పండుగను పురస్కరించుకుని భాగ్యనగరంలో ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ బడా గణేశుడు ఈ ఏడాది 70 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా అంగరంగ వైభవంగా కొలువుదీరాడు. ఉత్సవాల తొలిరోజు సందర్భంగా తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా దంపతులు మహాగణపతికి తొలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్ దంపతులకు మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు మహారాష్ట్రలో ప్రాచుర్యం పొందినప్పటికీ, గత 72 ఏళ్లుగా ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠిస్తున్న విగ్రహానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రజలంతా విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

2

*- హైదరాబాద్ (ఖైరతాబాద్), సెప్టెంబర్ 12 (ఉద్యమ కెరటం)*

## కుటుంబ సమేతంగా సీఎం రేవంత్ గణపతి పూజ

జూబ్లీహిల్స్ నివాసంలో ప్రత్యేక పూజలు 2

# సెమికాన్ ఇండియా 2026



భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహిం చనున్న 'సెమికాన్ ఇండియా-2026' ఐదో ఎడిషన్‌కు రంగం సిద్ధమైంది. సెప్టెం బర్ 17న ఢిల్లీలోని యశోభూమిలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సదస్సును ప్రారం భించనున్నారు. 17 నుంచి 19 వరకు మూడు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శన లో దేశ, విదేశాలకు చెందిన 600కు పైగా సంస్థలు పాల్గొననున్నాయి. వీటిలోనే దాదాపు 300 విదేశీ కంపెనీలు ఉండనున్నాయి. 'సిలికాన్ టు సిస్టమ్స్-బిల్డింగ్ ది ఎకోసిస్టమ్' ఇతివృత్తంతో ఇండియా సెమీకండక్టర్ మిషన్, సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ, అంతర్జాతీయ పరిశ్రమల సంస్థ 'సెమి' సంయుక్తంగా సదస్సును నిర్వహిస్తున్నాయి. ఏఎస్ఎంఎల్, మైక్రాన్, టాటా ఎలక్ట్రానిక్స్, ఇన్ఫినియాన్, లామ్ రీసెర్చ్ వంటి అంతర్జాతీయ, దేశీయ దిగ్గజాలు ఇందులో పాల్గొననున్నాయి.

*- న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం)*

- సెప్టెంబర్ 17 నుంచి గ్లోబల్ సదస్సు
- ఢిల్లీలోని యశోభూమిలో 'సెమికాన్ ఇండియా 2026' 5వ ఎడిషన్‌ను ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- 600కు పైగా గ్లోబల్, దేశీయ కంపెనీల భాగస్వామ్యం
- 'సెమికాన్ 2.0' కోసం రూ.1.27 లక్షల కోట్ల కేటాయింపు
- 'సెమికాన్ ఇండియా'కు దిగ్గజాల క్యూ
- చిప్ డిజైన్ నుంచి తయారీ వరకు ఆరు ప్రధాన స్తంభాలు

4



## రేవంత్ సర్కార్‌కు గణనాథుడు సద్బుద్ధి ఇవ్వాలి

- ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలన్న రాంచందర్‌రావు
- గణేశ్ మండపాలకు పూర్తి సహకారం అందించాలని సూచన

2

## కేటీఆర్ సిబ్బంది విచారణ

- అసెంబ్లీ గేటు ఘటన కేసులో పీఏ, పీఆర్వో హాజరు
- విచారణ గదిలో దాడి జరిగిందన్న హరీశ్‌రావు ఆరోపణ
- 'రౌడీల రాజ్యం' అంటూ కేటీఆర్ ఆగ్రహం
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్
- దాడి జరగలేదని సైఫాబాద్ పోలీసుల వివరణ

2

### సైఫాబాద్ ఠాణాలో కొత్త వివాదం!



## పార్టీ విస్తరణపై కవిత దూకుడు

2

- మరో 18 స్థానాలకు ఇన్‌చార్జులు
- ఇప్పటివరకు 60 నియోజకవర్గాల్లో నియామకాలు
- జిల్లాలు.. అనుబంధ విభాగాలకూ కొత్త బాధ్యులు
- మెదక్ లోక్‌సభ స్థానానికీ అధ్యక్షుడి నియామకం
- తెలంగాణ రక్షణ సేన బలోపేతంపై ప్రత్యేక దృష్టి



# ఖైరతాబాద్‌లో కొలువుదీరిన బడా గణేశ్



## కుటుంబ సమేతంగా సీఎం రేవంత్ గణపతి పూజ

**జూబ్లీహిల్స్ నివాసంలో ప్రత్యేక పూజలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** సీఎం రేవంత్ రెడ్డి వినాయక చవితి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి గణపతి పూజ నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, విజయాలు కలగాలని ప్రార్థించారు.

**విఘ్నాలను తొలగించి విజయాలు అందించాలి**

పవిత్రమైన వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నాలను తొలగించి, విజయాలను అందించే ఆదిదేవుడైన విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. గణనాథుని కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. సమాజంలో సౌభ్రాతృత్వం, సద్భావన మరియు మానవతా విలువలు మరింత పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. మన ఆశయాలకు, సంకల్పాలకు ఎదురయ్యే విఘ్నాలను తొలగించి, విజయబాటలు వేసేలా జ్ఞానాన్ని, ధైర్యాన్ని, సత్ప్రవర్తనను ప్రసాదించాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థిద్దామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## రేవంత్ సర్కార్‌కు గణనాథుడు సద్బుద్ధి ఇవ్వాలి

**ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలన్న రాంచందర్‌రావు**

**గణేశ్ మండపాలకు పూర్తిస్థాయి సహకారం అందించాలని సూచన**



**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసేలా, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి విఘ్నేశ్వరుడు 'సద్బుద్ధి' ప్రసాదించాలని ప్రార్థించినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించుకునేందుకు మండపాల నిర్వాహకులకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం పాడిపంటలతో వర్ధిల్లాలని గణనాథుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించేలా విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఏటేటా గణేశ్ ఉత్సవాలపై ప్రజల్లో భక్తిప్రపత్తులు ఇనుమడిస్తున్నాయని, ఊరూరా ప్రజలు పెద్దఎత్తున వేడుకల్లో భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. గణేశ్ నవరాత్రుల సందర్భంగా భక్తులు, మండపాల నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని రాంచందర్‌రావు సూచించారు. ముఖ్యంగా భద్రత, రవాణా ఏర్పాట్లను పటిష్ఠం చేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా సహకరించాలని కోరారు.

## నల్గొండ జిల్లాలో విషాద ఘటన

**గణేశ్ మండపంలో పూజారి ఆకస్మిక మృతి**



**నల్గొండ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** వినాయక చవితి వేడుకలు జరుగుతున్న వేళ నల్గొండ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. గణపతి పూజ నిర్వహిస్తున్న ఓ పూజారి ఆకస్మికంగా మృతిచెందాడు. పూజ చేసే విషయంలో స్థానికులతో జరిగిన వాగ్వాదం ఈ ఘటనకు దారితీసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటన తిరుమలగిరి సాగర్ మండలం చింతలపాలెం గ్రామంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే, నాగార్జున సాగర్‌కు చెందిన ఉప్పల దత్తు ప్రసాద్ అనే పూజారి వినాయక చవితి సందర్భంగా చింతలపాలెంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో పూజలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన గుండాల రవి, పున్నయ్య అనే ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చారు. ముందుగా తమ మండపంలో పూజ చేయాలని పట్టుబట్టడంతో పూజారి దత్తు ప్రసాద్‌తో వారికి వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని పూజారికి నచ్చజెప్పి, గుండాల రవికి చెందిన మండపం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజ పూర్తి చేసిన కొద్దిసేపటికే దత్తు ప్రసాద్ అకస్మాత్తుగా స్పృహతప్పి కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను సాగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పండుగ రోజున జరిగిన ఈ దురదృష్టకర సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పూజారి మృతికి కచ్చితమైన కారణాలు దర్యాప్తులో తేలనున్నాయి.

## 70 అడుగుల పంచముఖ సంకటహర మహాగణపతి

**గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతుల తొలిపూజ**

**పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**తొలిరోజే పోటెత్తిన భక్తులు.. పోలీసు బందోబస్తు**









**హైదరాబాద్ (ఖైరతాబాద్), సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో బడా గణేశుడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఈ ఏడాది 70 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో కొలువుదీరిన గణనాథుడికి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా దంపతులు తొలి పూజ నిర్వహించారు. తొలిరోజే మహాగణపతి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఖైరతాబాద్ పరిసరాలు సందడిగా మారాయి. గవర్నర్ దంపతులకు మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికి మహాగణపతి విగ్రహం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అర్చకులు గవర్నర్ దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలు మహారాష్ట్రలో ప్రారంభమైనప్పటికీ ఖైరతాబాద్ మహాగణపతికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 72 ఏళ్లుగా ఇక్కడ గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు. గణపతి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు, సుభిక్షంతో ఉండాలని ఆకాంక్షించారు.

**భారీ కండువా.. యజ్ఞోపవీతం సమర్పణ**

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మహాగణపతికి భారీ కండువాతోపాటు యజ్ఞోపవీతాన్ని సమర్పించారు. ప్రత్యేక పూజలు, భక్తుల గణపతి నామస్మరణతో ఖైరతాబాద్ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పంచముఖ సంకటహర మహాగణపతిని దర్శించుకునేందుకు తొలిరోజే భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఖైరతాబాద్ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ భద్రతా చర్యలు చేపట్టారు.

## కేటీఆర్ సిబ్బంది విచారణ

**సైఫాబాద్ ఠాణాలో కొత్త వివాదం!**

**అసెంబ్లీ గేటు ఘటన కేసులో పీఏ, పీఆర్వో హాజరు**

**విచారణ గదిలో దాడి జరిగిందన్న హరీశ్ ఆరోపణ**

**'రౌడీల రాజ్యం' అంటూ కేటీఆర్ ఆగ్రహం**

**సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్**

**దాడి జరగలేదని సైఫాబాద్ పోలీసుల వివరణ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఈ నెల 7న చోటుచేసుకున్న వివాదానికి సంబంధించి నమోదైన కేసు మరో మలుపు తిరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఆర్వో మాణిక్య మహేశ్, పీఏ కుంబాల మహేందర్‌రెడ్డి సోమవారం సైఫాబాద్ పోలీసుల విచారణకు హాజరయ్యారు. అయితే విచారణ జరుగుతున్న సమయంలో పోలీస్‌స్టేషన్‌లోనే వారిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించడం దుమారం రేపింది. ఈ ఆరోపణలను పోలీసులు ఖండిస్తూ అసలు జరిగింది వేరని వివరణ ఇచ్చారు. సైఫాబాద్ పోలీసులు జారీ చేసిన నోటీసుల మేరకు మాణిక్య మహేశ్, మహేందర్‌రెడ్డి దర్యాప్తు అధికారి ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ ప్రాంగణం వద్ద విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకున్నారన్న ఆరోపణలపై రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి. జంగయ్య ఫిర్యాదు మేరకు సెప్టెంబర్ 9న వీరిద్దరిపై భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు నేపథ్యంలో కేటీఆర్ సహాయకులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తు కొనసాగించేందుకు మాత్రం అనుమతించింది. ఈ నేపథ్యంలోనే ఇద్దరూ విచారణకు హాజరయ్యారు.



**అసెంబ్లీ గేటు వద్ద మొదలైన వివాదం**

సెప్టెంబర్ 7న కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఉన్న నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లారు. రాజకీయ నినాదాలు ఉన్న దుస్తులతో లోపలికి అనుమతించేది లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు 12 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఇప్పటికే రెండు కేసులు నమోదయ్యాయి. మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు వారిని దూషించారన్నది పోలీసుల ప్రధాన ఆరోపణ. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో మరో ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై ప్రత్యేకంగా కేసు నమోదైంది. మరోవైపు అసెంబ్లీ వద్ద తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులే దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌తోపాటు గవర్నర్‌కు కూడా ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు.

**'మాస్కులు ధరించి దాడి చేశారు'**

కేటీఆర్ పీఆర్వో మహేశ్, పీఏ మహేందర్‌రెడ్డి విచారణకు హాజరైన సమయంలో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లోని ఇంటరాగేషన్ గదిలో మాస్కులు ధరించిన కొందరు వ్యక్తులు వారిపై దాడికి పాల్పడ్డారని హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ న్యాయవాద బృందం సభ్యులు గట్టిగా నిలదీయడంతో సదరు వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ కూడా తీవ్రంగా స్పందించారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంలో 'రౌడీలు, గూండాల రాజ్యం' నడుస్తోందని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌లో తన సిబ్బందిపై దాడి జరిగిందని పేర్కొంటూ ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**'దాడి జరగలేదు'.. పోలీసుల ఖండన**

బీఆర్ఎస్ నేతల ఆరోపణలను సైఫాబాద్ పోలీసులు ఖండించారు. పోలీసుల సమక్షంలో కేటీఆర్ సిబ్బందిపై దాడి జరిగిందన్న ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. అసలు ఏం జరిగిందనే అంశంపై ప్రకటన ద్వారా వివరణ ఇచ్చారు. గణేశ్ మండపం వద్ద డీజే నిర్వహణకు అనుమతి కోరుతూ కొందరు యువకులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారని తెలిపారు. అసెంబ్లీ సమీపంలో న్యూసెన్స్ సృష్టించిన కేసుకు సంబంధించి అక్కడ ఉన్నవారిని కూర్చోబెట్టి మాట్లాడుతున్న విషయంపై ఆ యువకులు వాగ్వాదానికి దిగారని పేర్కొన్నారు. దీంతో వారిని వెంటనే అక్కడి నుంచి పంపించివేశామని పోలీసులు వెల్లడించారు. తమ సమక్షంలో ఎలాంటి దాడి జరగలేదని స్పష్టం చేశారు. దీంతో అసెంబ్లీ గేటు వద్ద మొదలైన బీఆర్ఎస్-పోలీసుల వివాదం ఇప్పుడు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన పరిణామాలపై పరస్పర ఆరోపణలతో మరింత ముదిరింది.



## పార్టీ విస్తరణపై కవిత దూకుడు

**మరో 18 స్థానాలకు ఇన్‌చార్జులు**

**ఇప్పటివరకు 60 నియోజకవర్గాల్లో నియామకాలు**

**జిల్లాలు.. అనుబంధ విభాగాలకూ కొత్త బాధ్యులు**

**మెదక్ లోక్‌సభ స్థానానికీ అధ్యక్షుడి నియామకం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** తెలంగాణ రక్షణ సేనను రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత సంస్థాగత నియామకాలను వేగవంతం చేశారు. వినాయక చవితి సందర్భంగా పార్టీ పరంగా పలు కీలక నియామకాలు చేపట్టిన ఆమె.. తాజాగా మరో 18 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను ఖరారు చేశారు. దీంతో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 60 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జుల నియామకం పూర్తయింది. పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిసారించిన కవిత.. అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు పలు జిల్లాలకు నూతన అధ్యక్షులను, అనుబంధ విభాగాలకు బాధ్యులను నియమించారు. పార్టీ కార్యకలాపాలను క్షేత్రస్థాయికి విస్తరించే లక్ష్యంతో ఈ నియామకాలు చేపట్టారు. తాజాగా పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, నాంపల్లి, అంబర్‌పేట్, ఇబ్రహీంపట్నం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఖానాపూర్, నిర్మల్, హుజూరాబాద్, దేవరకొండ, ఇల్లందు, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు కొత్త ఇన్‌చార్జులను నియమించారు. అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలోనే కాకుండా పార్లమెంట్ స్థాయిలోనూ పార్టీ నిర్మాణంపై కవిత దృష్టి సారించారు. ఇందులో భాగంగా మెదక్ లోక్‌సభ స్థానానికి పార్టీ అధ్యక్షుడిని ప్రకటించారు. తాజా నియామకాలతో రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన విస్తరణను మరింత వేగవంతం చేస్తూ రాబోయే ఎన్నికలకు సంస్థాగతంగా సిద్ధమయ్యే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జ్ గెహ్లాట్?

- పది నెలల సెలవుపై మీనాక్షి నటరాజన్
- ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లనున్న నేత
- రేసులో ముకుల్ వాస్నిక్, శక్తిసిన్హ్ గోహిల్
- గెహ్లాట్ వైపే అధిష్ఠానం మొగ్గు అంటూ చర్చ
- త్వరలోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మార్పుపై పార్టీలో చర్చ మొదలైంది. ప్రస్తుత ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లనున్న నేపథ్యంలో ఆమె స్థానంలో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్‌ను నియమించే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం సుమారు పది నెలలపాటు సెలవు తీసుకోనున్నట్లు సమాచారం. దీంతో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలను చూసేందుకు కొత్త ఇన్‌చార్జ్‌ను నియమించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో అశోక్ గెహ్లాట్ పేరును కాంగ్రెస్ అధిష్ఠానం ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గెహ్లాట్‌తోపాటు పార్టీ సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, శక్తిసిన్హ్ గోహిల్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ముఖ్యమంత్రిగా, పార్టీ సీనియర్ నేతగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న గెహ్లాట్ వైపే అగ్రనాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీపా దాస్‌మున్షీ స్థానంలో 2025 ఫిబ్రవరి 14న మీనాక్షి నటరాజన్ తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏఐసీసీ పరిశీలకురాలిగానూ వ్యవహరించారు. రాహుల్ గాంధీకి సన్నిహిత నేతగా గుర్తింపు పొందిన ఆమె 2009లో మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 30 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మీనాక్షి నటరాజన్ సుదీర్ఘ సెలవు నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జ్‌గా ఎవరిని నియమిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే తుది నిర్ణయం తీసుకుని అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

# దమ్ముంటే తలసానిని ప్రతిపక్ష నేతను చేయండి

- బీఆర్ఎస్‌కు మహేశ్‌కుమార్ గౌడ్ సవాల్
- దళితులకు కేసీఆర్ అన్యాయం చేశారని ఆరోపణ
- మూడెకరాల భూమి.. దళితబంధుపై నిలదీత
- 'నేలను కాదు.. మీ బుర్రను శుద్ధి చేసుకోండి' అంటూ ఫైర్
- కొండా సురేఖ ఢిల్లీ పిలుపుపై సమాచారం లేదని వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రతిపక్ష నేతగా నియమించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. కేసీఆర్ ఎలాగూ అసెంబ్లీకి రావడం లేదని, ఆయన స్థానంలో బీసీ నేతకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో దళితులకు కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారని ఆరోపిస్తూ మూడెకరాల భూమి, దళితబంధు హామీలపై ప్రశ్నలు సంధించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్‌కుమార్ గౌడ్.. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. ఓట్ల కోసమే దళిత కార్డును ఉపయోగించుకున్నారని ఆరోపించారు. దళిత సమాజం కేసీఆర్‌ను ఎప్పటికీ క్షమించదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ 2003లో దళితుల కోసం రూపొందించిన డాక్యుమెంట్‌ను అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్న హామీ ఏమైందని, దళితబంధును ఎందుకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని నిలదీశారు. అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాకుండా ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని హితవు పలికారు. దళితుల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదని విమర్శించారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నేతలపైనా మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. "నేలను కాదు.. మీ బుర్రను శుద్ధి చేయాలి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీలో బీసీ నేతకు ముఖ్యమంత్రి పాత్ర ఇచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. "దమ్ముంటే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రతిపక్ష నేతగా చేయండి. కేసీఆర్ ఎలాగూ అసెంబ్లీకి రావడం లేదు. బీసీ నేతకు ఆ హోదా ఇవ్వండి" అని సవాల్ చేశారు. తలసానికి ప్రతిపక్ష నేత హోదా ఇస్తే సస్పెన్షన్ ఎత్తివేసే అంశాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీకి పిలిచిందన్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఆ విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ఎవరైనా కబ్జా చేసి ఉంటే ఆ వ్యవహారాలు తప్పకుండా బయటకు రావాల్సిందేనని స్పష్టం చేశారు.

# రాహుల్ ప్రధాని కావాలని గణేశున్ని కోరుకున్నా

**వి. హనుమంతరావు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 14:** రాహుల్ గాంధీ ప్రధాని కావాలని గణనాథున్ని కోరుకున్నట్లు ప్రభుత్వ సలహాదారుడు వి. హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు తెలుగు రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర యువతకు ఉద్యోగాలు రావాలని, వారిని నిరుద్యోగపు విషవలయం నుంచి బయటపడేయాలని వినాయకుడిని ప్రార్థించినట్లు హనుమంతరావు తెలిపారు. అనంతరం కులగణన, రిజర్వేషన్లపై హనుమంతరావు స్పందించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న జనగణనలో బీసీల ఊసే లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకు కూడా అన్యాయం జరుగుతోందని, బీసీల గణనను చేపట్టాలని రాహుల్ డిమాండ్ చేసినా.. ప్రధాని మోదీ పెడచెవిన పెడుతున్నారన్నారు. బీసీల గణన చేపడితే రాహుల్ గాంధీకి ప్రయోజనం చేకూరుతుందని మోదీ భయపడుతున్నారని ఆయన ఆరోపించారు. దేశంలోనే ప్రథమంగా కులగణన చేపట్టి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రలో స్థానం సంపాదించారని హనుమంతరావు అన్నారు. అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేపడతామని క్యాబినెట్‌లో రేవంత్ తీర్మానం చేశారని.. అన్నట్లుగానే బీసీల సంఖ్యను గణించి.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించారని ఆయన కొనియాడారు.

అన్ని జిల్లాలు తిరిగి అవగాహన కల్పిస్తాం: ఏఐసీసీ ఓబీసి చైర్మన్ ముఖుల్ యాదవ్ సెన్సెస్‌లో బీసీల పేరు లేకపోవడం అన్యాయమని ఏఐసీసీ ఓబీసీ చైర్మన్ ముఖుల్ యాదవ్ అన్నారు. జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చే వరకూ పోరాటం చేస్తామన్నారు. వంద రోజుల పాటు ప్రతి జిల్లా తిరుగుతూ.. ఓబీసీలకు జరుగుతున్న అన్యాయంపై అవగాహన కల్పిస్తామని ముఖుల్ పేర్కొన్నారు. కాగా.. 1948లో జాతీయ జెండా ఎగరవేసిశారని వల్లాలలో 10 మంది యువకులను నిజాం పోలీసులు కాల్చి చంపారని ఆయన చెప్పారు. ఈ నెల 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా వల్లాల గ్రామంలో అమరవీరుల విగ్రహాలు ప్రారంభిస్తామని ముఖుల్ యాదవ్ వెల్లడించారు.

# ఇంటర్ విద్యార్థినిపై 8 మంది సామూహిక అత్యాచారం

**పదో తరగతిలో మొదలైన పరిచయం**

**తప్పించుకుని ఇల్లు చేరిన బాధితురాలు**

**8 మంది నిందితులపై పోక్సో కేసు నమోదు**



**హైదరాబాద్ (అల్వాల్):** హైదరాబాద్‌లోని అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత హేయమైన, దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. 16 ఏళ్ల ఇంటర్ విద్యార్థినిపై నెలల తరబడి ఎనిమిది మంది వ్యక్తులు దారుణానికి ఒడిగట్టి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు వారి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులకు విషయాన్ని వెల్లడించడంతో ఈ ఘోరం బయటపడింది. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్వాల్ పోలీసులు నిందితులపై పోక్సో (ఫాజూబా) చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారానికి చెందిన బాలికకు పదో తరగతిలో జెర్రీ వరుణ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. కొన్ని నెలల క్రితం అతడు చాక్లెట్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి కారులోనే లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆపై తన స్నేహితులైన రొమాల వరుణ్, డేవిడ్ వరుణ్‌లకు పరిచయం చేయగా, వారు బాలికకు గంజాయి, మద్యం అలవాటు చేసి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశారు. తండ్రి మందలించడంతో ఈ నెల 9న బాలిక బొల్లారం రైల్వే స్టేషన్‌కు వెళ్లగా, అక్కడ పరిచయమైన నీరజ్, విక్కీ అనే వ్యక్తులు మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేశారు. అక్కడితో ఆగకుండా విక్కీ, నిఖిల్ మరియు వారి స్నేహితులు దూలపల్లిలోని ఓయో గదికి, మేడ్చల్ రైల్వే స్టేషన్ వద్ద రైలులోకి బలవంతంగా తీసుకెళ్లి మత్తులో ఉన్న బాలికపై దారుణానికి ఒడిగట్టారు. అనంతరం మల్కాజిగిరి నుంచి ధూల్‌పేటకు ఆటోలో వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, సమయం చూసి బాధితురాలు వారి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకుంది. తీవ్ర మానసిక, శారీరక క్షోభకు గురైన బాలిక ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఎనిమిది మంది నిందితులపై కేసు నమోదు చేసి, వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.




# శంషాబాద్‌లో ట్రావెల్స్ బస్సు బీభత్సం.. ఒకరి మృతి

**శంషాబాద్‌లో అదుపుతప్పిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు**

**హోటల్‌లోకి దూసుకెళ్లడంతో ఒకరు అక్కడికక్కడే మృతి**

**ప్రమాదంలో 50 మందికి పైగా గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** హైదరాబాద్ నగర శివారు శంషాబాద్‌లో సోమవారం ఉదయం ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన బస్సు వేగంగా ఓ హోటల్‌లోకి దూసుకెళ్లడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళన నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. కిషన్‌గూడలోని సెవెన్‌హిల్స్ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థకు చెందిన ఓ బస్సు, ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను తప్పించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు రోడ్డు పక్కనే ఉన్న బాలాజీ భవన్ హోటల్‌లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో హోటల్‌లో టీ తాగుతున్న వ్యక్తిని బస్సు ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని కరీంనగర్ వాసి అజ్మల్‌గా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో గాయపడిన 50 మందికి పైగా క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద తీవ్రతకు హోటల్ ముందు పార్క్ చేసి ఉన్న మూడు కార్లు కూడా పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# నల్లగొండలో కేటీఆర్ నడిస్తే.. నేనూ నడుస్తా!

**కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి సవాల్**




**నల్లగొండ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నల్లగొండ జిల్లాలో పాదయాత్ర చేస్తే తాను కూడా పాదయాత్ర చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ నాటికి మూడేళ్లు పూర్తవుతుందని, దేశంలో ఎక్కడా లేని పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. సోమవారం ఓ వార్తా చానల్‌తో కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలోని ప్రతి మండల కేంద్రం, జిల్లా కేంద్రానికి రెండేళ్లలో డబుల్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. హడ్కో రుణంతో హ్యామ్ విధానంలో రహదారి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రోడ్లు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్–విజయవాడ మార్గాన్ని ఆరు లైన్లుగా విస్తరించేందుకు రూ.12,073 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందుకు వచ్చే అక్టోబర్‌లో టెండర్లు పిలవనున్నామని, జనవరిలో పనులు ప్రారంభించి 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ పాదయాత్ర ప్రస్తావనపై స్పందించిన కోమటిరెడ్డి.. "కేటీఆర్ నల్లగొండ జిల్లాలో పాదయాత్ర చేస్తే.. నేనూ పాదయాత్ర చేస్తా" అంటూ సవాల్ విసిరారు.

# వివాహితపై యాసిడ్ దాడి

**ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి**



**కామారెడ్డి, సెప్టెంబర్14:** యాసిడ్ దాడి జరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మరణించింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం జంగంపల్లిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం బిక్కనూరుకు చెందిన దివ్యవాణికి నిజామాబాద్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంత కాలంగా దంపతుల మధ్య విభేదాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దివ్యవాణి పుట్టింటిలో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి ఆమె బయటకు వెళ్లింది. ఆ తర్వాత ఇంటికి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దివ్యావాణి కోసం భర్తతోపాటు కుటుంబ సభ్యులు కూడా గాలిస్తున్నారు. ఆదివారం రాత్రి జంగంపల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద కాలిన గాయాలతో దివ్యవాణిని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించింది. అయితే భర్తతోపాటు అత్తమామలు దాడి చేయడంతోనే తమ కుమార్తె మృతి చెందిందని దివ్యవాణి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో వైపు ఆమె మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



# బీజేపీలో చేరేందుకు సిద్ధం

## టీఎంసీ రెబల్ ఎంపీ ప్రకటన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** టీఎంసీ రెబల్ నేత, కూచ్ బేహార్ ఎంపీ జగదీశ్ చంద్ర బాసునియా తాజాగా సంచలన ప్రకటన చేశారు. టీఎంసీ నుంచి బయటకు వచ్చిన 17 మంది రెబల్ ఎంపీలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన 20 మంది ఎంపీలు నేషనలిస్టు పార్టీలో చేరిన విషయం తెలిసిందే. వీరిలో 17 మంది బీజేపీలోకి మారేందుకు సిద్ధంగా ఉన్నారని ఎంపీ జగదీశ్ అన్నారు. 'మాలో 17 మంది ఎంపీలు బీజేపీలో చేరనున్నారు. మొత్తం ఎంపీల్లో ఈ సంఖ్య మూడింట రెండువంతులు కాబట్టి మాకు యాంటీ డిఫెక్షన్ లా వర్తించదు' అని చెప్పారు. ఈ పరిణామాలకు బీజేపీ దూరంగా జరిగే ప్రయత్నం చేసింది. పశ్చిమబెంగాల్ బీజేపీ చీఫ్ సమిక్ భట్టాచార్య మాట్లాడుతూ కేవలం పార్టీలో చేరతామంటూ వచ్చిన ప్రతి ఒక్కరినీ తాము చేర్చుకోబోమనిచెప్పారు. ఎంపీ జగదీశ్ కామెంట్స్‌పై మరో రెబల్ ఎంపీ శతాబ్దీ రాయ్ కూడా ఆచితూచి స్పందించారు. అవి జగదీశ్ వ్యక్తిగత వ్యాఖ్యలని అన్నారు. ఈ విషయంలో తాము ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. మరో ఎంపీ అబూతాహిర్ ఖాన్ మాత్రం ఘాటుగా స్పందించారు. తమ తరఫున మాట్లాడే హక్కు ఆయనకు లేదని తేల్చి చెప్పారు. మైనారిటీ వర్గానికి చెందిన ఎంపీలు బయటనుంచే బీజేపీకి మద్దతు ఇస్తారన్న జగదీశ్ వ్యాఖ్యలను కూడా తాహిర్ ఖండించారు. 'మేము బీజేపీలో గానీ ఎన్‌డీఏలో గానీ చేరము. ఇది మాత్రం స్పష్టంగా చెప్పదలుచుకున్నాను' అని అన్నారు. అయితే, ప్రధాని లేదా ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం పాల్గొంటామని చెప్పారు.

# ఢిల్లీ ఎయిర్‌పోర్టులో భద్రతా లోపం..


## ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ లేకుండానే ఇండియా విడిచిన విదేశీయులు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** ఢిల్లీ ఎయిర్‌పోర్టులో భద్రతా లోపం బయటపడింది. సరైన ఇమ్మిగ్రేషన్ అనుమతులు లేకుండానే ముగ్గురు విదేశీయులు దేశం విడిచివెళ్లిపోయారు. దీంతో మరోసారి మన భద్రతా ప్రమాణాలపై చర్చ జరుగుతోంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. ఇటలీకి చెందిన ముగ్గురు పౌరులు ఇండియాలో పర్యటించారు. వారు పంజాబ్ (అమృత్‌సర్) నుంచి విమానంలో ఢిల్లీ చేరుకున్నారు. అక్కడి ఎయిర్‌పోర్టు నుంచి తిరిగి లుఫ్తాన్సా సంస్థకు చెందిన విమానంలో ఇటలీలోని మ్యునిచ్ చేరుకున్నారు. అయితే, ఈ ముగ్గురు ఇటాలియన్ ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ లభించలేదు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ పూర్తి కాకుండానే ముగ్గురూ ఇండియా విడిచి వెళ్లిపోయారు. ఈ ఘటన సెప్టెంబర్ 3-4 మధ్య రాత్రి పూట జరిగింది. వీరు ముగ్గురు ఎయిరిండియా విమానంలో అమృత్‌సర్ నుంచి రాత్రి 12.50 గంటలకు ఢిల్లీ చేరుకున్నారు. గంట తర్వాత ఢిల్లీ నుంచి బయల్దేరి మ్యునిచ్ వెళ్లిపోయారు. నిబంధనల ప్రకారం డొమెస్టిక్ ఎయిర్‌పోర్టులకు చేరుకున్న ప్రయాణికులు విదేశాలకు వెళ్లాలనుకుంటే అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి. లగేజ్ చెక్ చేయడం, పాస్‌పోర్టు, ఇతర డాక్యుమెంట్లు పరిశీలించడం చేసిన తర్వాతే అనుమతులివ్వాలి. అయితే, ఈ ముగ్గురు ప్రయాణికులకు అలాంటిదేమీ జరగలేదు. పైగా వీరికి ఢిల్లీ వస్తున్నప్పుడు డొమెస్టిక్ బోర్డింగ్ పాసెస్ ఇచ్చారు. అలాగే, లుఫ్తాన్స విమానానికి సంబంధించిన బోర్డింగ్ పాసెస్ కూడా ఇచ్చారు. నిజానికి ఇలా ఇవ్వడం కుదరదు. ఢిల్లీలో ఇమ్మిగ్రేషన్ పూర్తైన తర్వాతే బోర్డింగ్ పాస్‌లు ఇవ్వాలి. కానీ, వాళ్లు నేరుగా ఇంటర్నేషనల్ జోన్‌కు వెళ్లిపోయి, విమానం ఎక్కేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించడంలో ఎయిరిండియా సంస్థ పాత్ర కూడా ఉంది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర విమానయాన శాఖ ఎయిరిండియాకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ అంశంపై విచారణ జరుగుతోంది.

# లొంగిపోయిన తరుణ్ తేజ్‌పాల్

## సెంట్రల్ జైలుకు తరలింపు..!



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** అత్యాచారం కేసులో దోషిగా తేలిన తెహెల్కా మాజీ ఎడిటర్, మాజీ మంత్రి తరుణ్ తేజ్‌పాల్ లొంగిపోయారు. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆగస్టు 25వ తేదీన సుప్రీం కోర్టు ఆదేశించడంతో సోమవారం గోవా పోలీసులకు ఆయన సరెండర్ అయ్యారు. మపుసాలోని అడిషనల్ సెషన్స్ కోర్టులో లొంగిపోయిన తేజ్‌పాల్‌ను కొల్వలే సెంట్రల్ జైలుకు తరలించారు పోలీసులు. మాజీ మంత్రి, తెహెల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్ లొంగిపోయారు. సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయన వినాయక చవితి రోజు గోవాలో సరెండరయ్యారు. కోర్టులో లొంగిపోయిన తేజ్‌పాల్ తాను సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేస్తానని ప్రకటించారు. 'బాంబే కోర్టు తీర్పుపై మళ్లీ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం. అత్యున్నత ధర్మాసనంలో న్యాయం జరుగుతుందని మాకు నమ్మకం ఉంది' అని తేజ్‌పాల్ అన్నారు. అత్యాచారం కేసులో బాంబే హైకోర్టు విధించిన శిక్షపై ఆయన అప్పీల్ చేసుకోగా అత్యున్నత ధర్మాసనం కొట్టిపారేసింది. ముందుగా లొంగిపోవాలని, ఆ తర్వాతే పిటిషన్‌ను విచారిస్తామని సుప్రీం కోర్టు పేర్కొంది. దాంతో.. గత్యంతరం లేక తేజ్‌పాల్ సోమవారం గోవాలో సరెండర్ అయ్యారు. దాంతో.. 10 ఏళ్ల శిక్ష అనుభవించడం కోసం ఆయనను పోలీసులు నార్త్ గోవాలోని కొల్వలే సెంట్రల్ జైలుకు తరలించారు.

# సెమికాన్ ఇండియా 2026

- సెప్టెంబర్ 17 నుంచి గ్లోబల్ సదస్సు
- ఢిల్లీలోని యశోభూమిలో 'సెమికాన్ ఇండియా 2026' 5వ ఎడిషన్‌ను ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- 600కు పైగా గ్లోబల్, దేశీయ కంపెనీల భాగస్వామ్యం
- 'సెమికాన్ 2.0' కోసం రూ.1.27 లక్షల కోట్ల కేటాయింపు
- 'సెమికాన్ ఇండియా'కు దిగ్గజాల క్యూ
- చిప్ డిజైన్ నుంచి తయారీ వరకు ఆరు ప్రధాన స్తంభాలు






**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించనున్న 'సెమికాన్ ఇండియా-2026' ఐదో ఎడిషన్‌కు రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ 17న ఢిల్లీలోని యశోభూమిలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సదస్సును ప్రారంభించనున్నారు. 17 నుంచి 19 వరకు మూడు రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనలో దేశ, విదేశాలకు చెందిన 600కు పైగా సంస్థలు పాల్గొననున్నాయి. వీటిలోనే దాదాపు 300 విదేశీ కంపెనీలు ఉండనున్నాయి. 'సిలికాన్ టు సిస్టమ్స్-బిల్డింగ్ ది ఎకోసిస్టమ్' ఇతివృత్తంతో ఇండియా సెమీకండక్టర్ మిషన్, సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ, అంతర్జాతీయ పరిశ్రమల సంస్థ 'సెమి' సంయుక్తంగా సదస్సును నిర్వహిస్తున్నాయి. ఏఎస్‌ఎంఎల్, మైక్రాన్, టాటా ఎలక్ట్రానిక్స్, ఇన్ఫినియాన్, లామ్ రీసెర్చ్ వంటి అంతర్జాతీయ, దేశీయ దిగ్గజాలు ఇందులో పాల్గొననున్నాయి.

### 12 ప్రాజెక్టులకు ఆమోదం.. మూడింట ఉత్పత్తి

'సెమికాన్ ఇండియా 1.0' కింద కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 12 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటిలో మూడు యూనిట్లు ఇప్పటికే వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించాయి. తొలి దశలో సాధించిన పురోగతిని కొనసాగిస్తూ దేశంలో పూర్తిస్థాయి సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించేందుకు కేంద్రం 'సెమికాన్ 2.0'ను తీసుకొచ్చింది. 2026 జులై 15న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో 'సెమికాన్ 2.0'కు ఆమోదం లభించింది. అంతకుముందు 2026--27 కేంద్ర బడ్జెట్‌లో దీనిని సూత్రప్రాయంగా ప్రకటించారు. రూ. 1,27,500 కోట్ల బడ్జెట్‌తో ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియా సెమీకండక్టర్ మిషన్ ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది.

### చిప్ డిజైన్‌కు భారీ ప్రోత్సాహం

'సెమికాన్ 2.0'లో ఆరు ప్రధాన రంగాలపై కేంద్రం దృష్టి పెట్టనుంది. మొదటిది చిప్ డిజైన్. దేశీయంగా ప్రాసెసర్లు, సిస్టమ్-ఆన్-చిప్స్, సెమీకండక్టర్ మేధోసంపత్తి నమూనాలను రూపొందించే కంపెనీలకు నిధులు, ప్రోత్సాహకాలు అందించనున్నారు. రక్షణ, అంతరిక్షం, కృత్రిమ మేధ, టెలికాం రంగాలకు అవసరమైన చిప్‌లను దేశీయంగానే రూపొందించుకునే సామర్థ్యం సాధించడం దీని లక్ష్యం. రెండోది సెమీకండక్టర్ తయారీకి అవసరమైన యంత్రాలు, ముడి పదార్థాల దేశీయ ఉత్పత్తి. ప్రత్యేక యంత్రాలు, అత్యంత శుద్ధి చేసిన రసాయనాలు, ప్రత్యేక వాయువులు, ఇతర మెటీరియల్స్‌ను భారత్‌లోనే తయారు చేసే సంస్థలను ప్రోత్సహించనున్నారు. తద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### మరిన్ని చిప్ తయారీ కేంద్రాలు

మూడో స్తంభంగా తయారీ కేంద్రాల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సిలికాన్ ఫ్యాబ్‌లు, డిస్‌ప్లే ఫ్యాబ్‌లతోపాటు విద్యుత్ వాహనాలు, పవర్ ఎలక్ట్రానిక్స్‌లో ఉపయోగించే కాంపౌండ్ సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్లను మరిన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నాలుగో అంశంగా అసెంబ్లీ, ప్యాకేజింగ్, పరీక్షల వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. తయారైన చిప్‌లను కట్ చేయడం, అసెంబ్లింగ్, పరీక్షించడం, తుది ఉత్పత్తిగా మార్చేందుకు అవసరమైన అధునాతన ప్యాకేజింగ్, అసెంబ్లీ--టెస్టింగ్ యూనిట్ల విస్తరణకు ప్రోత్సాహం ఇవ్వనున్నారు.




### పరిశోధన నుంచి నైపుణ్యాల దాకా

ఐదో స్తంభంగా పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారించనున్నారు. కృత్రిమ మేధ చిప్‌లు, తదుపరి తరం సెమీకండక్టర్ సాంకేతికతలపై పరిశోధన కోసం అంతర్జాతీయ పరిశోధనా కేంద్రాలతో కలిసి పనిచేయడంతోపాటు దేశీయ పరిశోధనకు మద్దతు ఇవ్వనున్నారు. ఆరో స్తంభంగా నైపుణ్యాభివృద్ధి, మానవ వనరులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు, నిపుణులకు సెమీకండక్టర్ రంగంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాబోయే సంవత్సరాల్లో లక్షలాది మంది నైపుణ్యం కలిగిన సెమీకండక్టర్ ఇంజినీర్లను సిద్ధం చేయాలన్నది లక్ష్యం.







### 400 విద్యాసంస్థలు.. 105 అంకుర సంస్థలకు సాయం

ఇండియా సెమీకండక్టర్ మిషన్ ద్వారా విద్యాసంస్థలు, అంకుర సంస్థలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ సాధనాలను ఉచితంగా లేదా రాయితీపై అందిస్తున్నారు. ఇప్పటివరకు 400కు పైగా విద్యాసంస్థలు, 105 అంకుర సంస్థలకు ఈ సాధనాలను అందించగా.. డిజైన్ ఆధారిత ప్రోత్సాహక పథకం కింద మరో 24 అంకుర సంస్థలకు ఆమోదం లభించింది. సెమీకండక్టర్ పరిశ్రమ దిగ్గజాలను ఒకే వేదికపైకి తీసుకురావడమే కాకుండా అంకుర సంస్థలు, విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు, హ్యాకథాన్‌లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కూడా 'సెమికాన్ ఇండియా--2026' వేదిక కానుంది. చిప్ రూపకల్పన నుంచి తయారీ, ప్యాకేజింగ్, పరిశోధన, మానవ వనర

# భారత వైవిధ్యం విందులోనూ కనిపించాలి

## బ్రిక్స్ శాకాహార విందు వివాదంపై ఒవైసీ స్పందన

## ఆహార అలవాట్లలోనూ దేశ వైవిధ్యం ప్రతిబింబిస్తుందని వ్యాఖ్య

## డిజిటల్ కరెన్సీపై స్పష్టత లేదని విమర్శ

## చైనా సరిహద్దు చర్చల్లో పారదర్శకతపై ప్రశ్న

## ఇరాన్--యూఏఈ భేటీ శుభపరిణామమని ప్రశంస



**హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** ఢిల్లీలోని భారత్ మంటపంలో బ్రిక్స్ దేశాల నాయకులకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన విందులో కేవలం శాకాహార వంటకాలను వడ్డించారన్న అంశంపై రేగిన రాజకీయ వివాదంపై హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. భారత సార్వభౌమత్వం, సంస్కృతి అనేవి విభిన్న ఆచారాలు, మతాలు, భాషలు, ఆహార అలవాట్లతో ముడిపడి ఉన్నాయని వ్యాఖ్యానించారు. దేశంలో మైనారిటీల్లోనూ దాదాపు 20 శాతానికి పైగా శాకాహారం తీసుకునేవారు ఉన్నారని ఒవైసీ పేర్కొన్నారు. భారతదేశ వైవిధ్యం సంస్కృతికే పరిమితం కాదని, మతాలు, భాషలు, ఆహార ప్రాధాన్యతల్లోనూ కనిపిస్తుందని చెప్పారు. విదేశీ ప్రతినిధులకు విందులో ఏది నచ్చిందో, ఏది నచ్చలేదో చెప్పలేమని.. అయితే భారత దౌత్యం దేశంలోని అన్ని సంస్కృతుల కలబోతను అంతర్జాతీయ వేదికలపై ప్రతిబింబించేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. విందు వివాదానికే పరిమితం కాకుండా బ్రిక్స్ సదస్సు ద్వారా సాధించిన దౌత్య, ఆర్థిక ఫలితాలపైనా ఒవైసీ ప్రశ్నలు లేవనెత్తారు. డిజిటల్ కరెన్సీ వినియోగంపై స్పష్టత లేదని పేర్కొన్నారు. చైనాతో భారత్ జరిపిన సరిహద్దు చర్చల్లో పెట్రోలింగ్ హక్కుల పునరుద్ధరణకు సంబంధించి మరింత పారదర్శకత అవసరమని అభిప్రాయపడ్డారు. అయితే బ్రిక్స్ వేదికగా ఇరాన్, యూఏఈ దేశాల ప్రతినిధులు ముఖాముఖి సమావేశం కావడాన్ని ఒవైసీ స్వాగతించారు. ఇరు దేశాల మధ్య చర్చలకు అవకాశం ఏర్పడటం శుభపరిణామమని పేర్కొన్నారు.



# ఉగ్రవాది మసూద్ అజార్‌ను పట్టిస్తే రూ.70 లక్షల రివార్డు

## పాకిస్థాన్ నయా నాటకం

## ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టు ముప్పు తప్పించుకునేందుకు రివార్డు పెంపు

## ఎఫ్ఐఏ 'రెడ్ బుక్' మోస్ట్ వాంటెడ్ జాబితాలో జైషే మహ్మద్ అధినేత పేరు చేర్పు

**ఇస్లామాబాద్, సెప్టెంబర్ 14 :** ఉగ్రవాదులకు నిధుల అందకుండా నిరోధించే అంతర్జాతీయ సంస్థ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) త్వరలో చేపట్టనున్న సమీక్షను దృష్టిలో ఉంచుకుని పాకిస్థాన్ మరోసారి నాటకానికి తెరలేపింది. భారతదేశంలో పలు విధ్వంసకర దాడులకు పాల్పడిన జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ అధినేత, ఐక్యరాజ్యసమితి గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించిన మసూద్ అజార్‌ను పట్టించిన వారికి ఇచ్చే పరిహారాన్ని (రివార్డు) 70 లక్షల పాకిస్థానీ రూపాయలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పాక్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఏ) విడుదల చేసిన 2026 'రెడ్ బుక్' మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో అజార్ పేరును పారిపోతున్న నిందితుడిగా (ఫ్యుజిటివ్) చేర్చింది. ఒకవేళ ఎఫ్ఏటీఎఫ్ సమీక్షలో విఫలమైతే మళ్లీ 'గ్రే లిస్ట్'లోకి వెళ్లే ప్రమాదం ఉండటంతో అంతర్జాతీయ సమాజం దృష్టిని మళ్లించేందుకే పాక్ ఈ చర్యలు చేపడుతోందని భారత దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. 2001 పార్లమెంట్ దాడి, 2008 ముంబై దాడులు, 2016 పఠాన్‌కోట్, 2019 పుల్వామా దాడుల వెనుక మసూద్ హస్తం స్పష్టంగా నిరూపితమైంది. ఇటీవలి 'ఆపరేషన్ సింధూర్' ద్వారా బహావల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రాన్ని భారత్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. మసూద్ తమ దేశంలో లేదని పాక్ చెబుతున్నప్పటికీ, అతను తమ భూభాగంలోనే రక్షణ పొందుతున్నాడని ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.



## గణనాథుల మార్గాల్లో బురద తొలగింపు

### కౌన్సిలర్ సాయిచరణ్ గౌడ్ ప్రత్యేక చొరవ

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 40వ వార్డు దస్నాపూర్, ధోభీ కాలనీ,కౌన్సిలర్ చరణ్ గౌడ్ ప్రత్యేక చొరవ చూపారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వర్షాల కారణంగా బురదమయంగా మారిన రోడ్లను భక్తులకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా యుద్ధప్రాతిపదికన బాగు చేయించారు.గణేష్ మండపాల సమీపంలో, స్వామి వారి వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు బురద ప్రాంతాల్లో కంకర డస్టను పోయించి చదును చేయించారు. దీనివల్ల భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిత్య పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక నృత్యాలు నిర్వహించుకునేందుకు వీలు కలిగింది. భక్తుల సౌకర్యార్థం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్ చరణ్ గౌడ్‌కు వార్డు ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మట్టి వినాయకుల పంపిణీ




**ఉద్యమ కెరటం, తాండూర్:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు సోమవారం రోజున తాండూర్ మండల కేంద్రంలోని ఐబిలో వినాయక చవితి పర్వదినమున పురస్కరించుకొని ప్రజలకు మట్టి వినాయకులను లయన్స్ క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఠాకూర్ ఉమ్రావ్ సింగ్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ చే చేయబడిన వినాయక ప్రతిమలు పర్యావరణానికి హాని కలిగిస్తాయి అన్నారు. అదే మట్టి వినాయకులు చెరువుల్లో వేసినను పర్యావరణానికి ఎలాంటి హాని జరగదన్నారు. ప్రజలు మట్టి వినాయకుల ప్రతిమలను వాడి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. మన సంస్కృతిలో ఏ పని ప్రారంభించినా విఘ్నాలు తొలగాలని విఘ్నేశ్వరుడిని ముందుగా పూజిస్తాం. భాద్రపద శుద్ధ చవితి నాడు మనమందరం ఎంతో సంబరంగా జరుపుకునే పండగ 'వినాయక చవితి'.... అయితే ఈ పండుగ వేళ మన భావి తరాల కోసం, మన ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కోసం ఆలోచించాల్సిన బాధ్యత మనపై ఉంది. మన నీటి వనరులు కలుషితం కాకుండా విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని మట్టితో చేసి, పూజించి, తిరిగి నీటిలో నిమజ్జనం చేయడం చాలా మంచిదని అన్నారు.ఈ కార్యక్రమంలో తాండూర్ తెలంగాణ లయన్స్ క్లబ్ కార్యదర్శి తాటిపాముల సాంబమూర్తి, కోశాధికారి గందె రాజయ్య, ఉపాధ్యక్షులు మద్దికుంట రామచందర్, రీజియన్ చైర్మన్ బాపురెడ్డి,క్యాబినెట్ సభ్యులు డి రాజన్న, రౌతు వెంకటేష్,మాజీ అధ్యక్షులు సిరంగి శంకర్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

### మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ నూతన మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం, వినాయక్ చౌక్ గోపాలకృష్ణ మఠం ముందర మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ , మున్సిపల్ సిబ్బంది పాల్గొని ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పూజించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. మట్టి విగ్రహాలతో పూజలు నిర్వహించడం వల్ల నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మన పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ఆదిలాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని చైర్‌పర్సన్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్ , డిఎంసి శ్రీనివాస్ , సామాజిక కార్యకర్త బండారి దేవన్న , మెప్మా సిబ్బంది మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆటో రవాణా కార్మికులకు సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలి

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఆటో, రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ చట్టాన్ని ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం వేంసూరు మండల కేంద్రంలోని ఎర్రా రామయ్య భవన్‌లో దంకర శ్రీను అధ్యక్షతన ఆటో కార్మికుల మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ, ఆటో రవాణా కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి సమాజానికి సేవ చేస్తూ దేశ జీడీపీ పెరుగుదలకు పరోక్షంగా సహకరిస్తున్నారని అన్నారు.ఆటో వాహనాల మరమ్మతుల కోసం స్పేర్ పార్ట్స్ కొనుగోలు చేసే సమయంలో కార్మికులు ప్రభుత్వానికి పన్నులు, సెస్సులు చెల్లిస్తున్నప్పటికీ వారి సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆటో, రవాణా కార్మికుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి వెంటనే సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఆటో కార్మికుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఏడాదికి రూ.12 వేల భృతి అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు.ఈ నెల 16న సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న సామూహిక కార్మికుల దీక్షలో ఆటో, రవాణా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఉచిత బస్సు పథకం అమలులో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆటో కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని అన్నారు. ఆటోలకు సంబంధించిన ఇన్సూరెన్స్ ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఆటో అడ్డాలకు శాశ్వత స్థలాలు కేటాయించడంతో పాటు షెడ్లు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ మహాసభలో సాధు



సుధాకర్, వాసాల ఆంజనేయులు, షేక్ గౌసుద్దీన్, బొజ్జా మారేశ్వరరావు, మల్లెల్లి రామారావు, కంచర్ల పుల్లయ్య, మహేష్, బొందల యాకోబు, సాధు కృష్ణ, ముల్లంగి శ్రీను, నల్లంటి నాగరాజు, తాళ్లూరి రామారావు, కంచర్ల శ్రీనులతో పాటు సుమారు 50 మంది ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వినాయక చవితి ఉత్సవాలు

### గణనాథుడు అనేక నామాలతో కొలవబడుతాడు

### విఘ్నేశ్వరుని పూజించిన వారికి సకల లాభాలు చేకూరుతాయి

### విదేశాల్లో సైతం వినాయక చవితిని చాలా ఘనంగా జరుపుకోవడం భారతదేశ సంస్కృతికి గొప్ప ప్రతీక

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** వినాయక చవితి హిందువుల అతి ముఖ్యమైన మరియు ఆనందకరమైన పండుగలలో ఒకటని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, వారి సతీమణి డాక్టర్ వి.వనజ నరేందర్ రెడ్డి తో కలిసి స్థానిక కరీంనగర్ లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో మరియు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో మొదటిరోజు పూజలో భాగంగా వైభవోపేతంగా నిర్వహించినటువంటి గణేష్ ప్రతిష్టాపన మహోత్సవానికి, కలశ స్థాపన కు హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణాలలో జ్యోతి ప్రజ్వలన పూజ కార్యక్రమాన్ని అట్టహాసంగా వేడుకగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్వతీ పరమేశ్వరుల కుమారుడైన శ్రీ విఘ్నేశ్వర స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ పండుగను చాలా గొప్పగా నిర్వహించుకుంటారని వారు చెప్పారు. భాద్రపద మాసం శుక్ల చతుర్థి రోజున ఈ పండుగను నిర్వహించుకుంటామని ఏ పని మొదలుపెట్టిన ముందుగా గణనాథుడిని పూజిస్తే ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తవుతాయని చరిత్రలో లిఖింపబడినదని వారు చెప్పారు. భక్తులు మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజలు చేయాలని పర్యవరణాన్ని పరిరక్షించాలని వారు సూచించారు. నిమజ్జన మహోత్సవం ప్రధాన ఘట్టమైనదనిలి ఈ ఘట్టాన్ని తిలకించినందుకు ప్రజలందరూ వారి ఇల్లునుండి బయటకు వచ్చి చూస్తానని వీక్షిస్తారని సమయం కేటాయిస్తానని స్వామి వారి యొక్క ఆశీస్సులు పొందుతారని వారు చెప్పారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా భగత్ నగర్, వావిలాలపల్లి, మంకమ్మతోట, సీతారాంపూర్, కొత్తపల్లి లోని విద్యా సంస్థల్లో మట్టి గణపతులను ప్రతిష్టించి పర్యావరణ హితంగా ఉంటున్నామని డ తగిన పూజా కార్యక్రమాలను చేయడం జరుగుతుందని వారు చెప్పారు. మొదటి రోజు పూజలో భాగంగా విశేష హారతి నిర్వహించడం జరిగిందని వారు చెప్పారు. ఈ పూజలో సంబంధిత క్యాంపస్ ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# వెన్నచెడు వెంకటాపురంలో ఘనంగా వినాయక ఉత్సవాలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని వెన్నచెడు వెంకటాపురం గ్రామంలోని బీసీ కాలనీలో [illegible] ప్రసాద్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ [illegible]సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనోత్సవం సోమవారం సాయంత్రం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. భక్తులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.వినాయక చవితి సందర్భంగా బీసీ కాలనీలో గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పండుగ సందర్భంగా కాలనీవాసులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి భక్తి వాతావరణాన్ని నెలకొల్పారు.సోమవారం సాయంత్రం గణనాథుడికి ప్రత్యేక పూజలు, మహా హారతి నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణనాథుడి విగ్రహాన్ని భారీ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపు సందర్భంగా భక్తులు గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ నిమజ్జనోత్సవ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, బీసీ కాలనీవాసులు, యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య గణనాథుడికి వీడ్కోలు పలికి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.





# తాళం వేసి ఉన్న ఇంటిలో తాళాలు పగలగొట్టి ఆభరణాల చోరీ

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం కిష్టంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని తాండూర్ బస్టాండ్ సమీపమున గల దుర్గం తానాజీ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఇంటికి తాళం వేసి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని దొంగలు వచ్చి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారని తాండూర్ ఎస్సై కే ప్రసాద్ రావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దుర్గం తానాజీకి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. చిన్న కుమారుడు అభిష్ లండన్ లో నివసిస్తుండగా, పెద్ద కుమారుడు జగన్ మరియు చిన్న కుమార్తె కల్పన లతో తానాజీ ఇంట్లో ఉంటున్నారు. రెండవ కుమార్తె చందన భర్త జాడి బాబురావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ పిల్లలు కూడా కిష్టంపేట లోని తానాజీ ఇంటిలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో మంచిర్యాలలో అద్దె ఇల్లు తీసుకునీ ఉండాలని ప్రతిపాదనతో కుటుంబ సభ్యులందరూ కలిసి ఈనెల 10వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. తిరిగి 13వ తేదీ సాయంత్రం మూడు గంటల 45 నిమిషములకు వచ్చి చూడగా ఇంటి తాళం లేకపోవడాన్ని వారి మనుమడు గమనించాడు. వెంటనే అందరూ ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు, దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో దాచి ఉంచిన బంగారు ఆభరణాలు చోరీ గురైనట్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే తానాజీ తాండూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి తాండూర్ ఎస్సై, మాదారం ఎస్సై సౌజన్య,పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తాండూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తాండూర్ ఎస్సై తెలిపారు.

# గణేష్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

## నేరాల నియంత్రణపై సీపీ గౌష్ ఆలం సమీక్ష



**ఉద్యమ కెరటం కరీంనగర్:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఆగస్టు నెల నెలవారీ నేర సమీక్ష సమావేశంలో నేర నియంత్రణ, దర్యాప్తు, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, సైబర్ నేరాలు, మహిళలు-చిన్నారుల భద్రత, డ్రగ్స్, ట్రాఫిక్ తదితర అంశాలపై సమీక్షించారు.

### గణేష్ ఉత్సవాలపై ప్రత్యేక చర్యలు:

మండపాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు అత్యవసర ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని, వాలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని సీపీ సూచించారు. మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట తదితర నిమజ్జన ప్రాంతాల్లో భారీ క్రేన్లు, నిరంతర విద్యుత్, గజ ఈతగాళ్లతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రూట్ మ్యాప్ అమలు చేయాలని, సోషల్ మీడియాలో వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

### నేర నియంత్రణపై సమీక్ష:

నేరం జరిగిన వెంటనే శాస్త్రీయ ఆధారాలతో సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, కోర్టు విచారణలో ఉన్న కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

### మహిళలు, చిన్నారుల భద్రత:

మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా పోక్సో, అత్యాచారం, ఇతర మహిళా సంబంధిత కేసుల్లో కోర్టు విచారణ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

### సైబర్ నేరాల నియంత్రణ:

సైబర్ నేర బాధితులకు వీలైనంత త్వరగా నగదు రికవరీ చేయడంతో పాటు, మోసాలకు పాల్పడుతున్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సి ఇ ఐ ఆర్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీని వేగవంతం చేయాలని సూచించారు.

### డ్రగ్స్, అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం:

మాదకద్రవ్యాలు, గుట్కా, పేకాట, అక్రమ ఇసుక రవాణా తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు.



### లోక్ అదాలత్‌లో 4,268 కేసుల పరిష్కారం

సెప్టెంబర్ 12న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 4,268 కేసులు పరిష్కరించబడ్డాయి. ఇందులో 451 ఎఫ్ఐఆర్ కేసులు, 1,019 ప్రమాద/ఇతర సంబంధిత కేసులు, 2,798 మోటార్ వెహికల్ కేసులు, 34 సైబర్ కేసులు ఉన్నాయి. అత్యధిక కేసులు పరిష్కరించిన కరీంనగర్ ట్రాఫిక్-685, కరీంనగర్-I టౌన్-495 పోలీస్ స్టేషన్లతో పాటు కేసుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సీపీ అభినందించారు.

### ప్రజలు, ఉత్సవ కమిటీలకు విజ్ఞప్తి

గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ నిర్వహించుకోవాలని, పోలీస్ శాఖకు ప్రజలు మరియు ఉత్సవ కమిటీలు సంపూర్ణ సహకారం అందించాలని సీపీ గౌష్ ఆలం కోరారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. కృష్ణమూర్తి, ఏసీపీలు, సీఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలపై గణనాథుడి ఆశీస్సులు ఉండాలి


## డోంగ్లీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాచావార్ లక్ష్మణ్ పటేల్



**డోంగ్లీ, సెప్టెంబర్ 15 (ఉద్యమ కెరటం):** విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు డోంగ్లీ మండల ప్రజలందరిపై ఉండాలని డోంగ్లీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాచావార్ లక్ష్మణ్ పటేల్ ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా మండల ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. గణనాథుడి కృపతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో ఎదురయ్యే విఘ్నాలన్నీ తొలగిపోయి అభివృద్ధి, విజయాలు చేకూరాలని ప్రార్థించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల వద్ద భక్తి, శాంతి, సోదరభావం, సామాజిక ఐక్యత ప్రతిబింబించేలా ఉత్సవాలు నిర్వహించాలని లక్ష్మణ్ పటేల్ సూచించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో డోంగ్లీ మండల ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సంపద, సౌభాగ్యం నిండాలని బాచావార్ లక్ష్మణ్ పటేల్ ఆకాంక్షించారు.

# కరీంనగర్‌లో మెడికల్ మాఫియా దందా

- స్కానింగ్ సెంటర్ల నిలువు దోపిడీ
- డాక్టర్ సిఫార్సు లేకపోతే రిపోర్టుల్లో నిర్లక్ష్యం; సీటీ స్కాన్ల పేరుతో వేలల్లో దండుకుంటున్న నిర్వాహకులు
- రూ.500 ఫీజుతో మొదలై స్కానింగ్‌లు, ల్యాబ్ పరీక్షలతో రూ.10 వేల వరకు బాధితులపై అదనపు భారం
- ల్యాబ్‌లు, హాస్పిటళ్ల మధ్య కమిషన్ల దందా; కన్నెత్తి చూడని వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు



**ఉద్యమ కెరటం, కరీంనగర్ క్రైమ్:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు మెడికల్ మాఫియా రోజురోజుకూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ రోగుల జేబులు గుల్ల చేస్తోంది. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు కుమ్మక్కై అనారోగ్యంతో వచ్చే బాధితులను నిలువునా దోపిడీ చేస్తున్నాయి. సాధారణ రుగ్మతలతో డాక్టర్ వద్దకు వెళ్తే ప్రైవేటు ఆసుపత్రి ఫీజు కేవలం రూ. 500 గానే కనిపిస్తున్నప్పటికీ, అనవసరమైన రక్త, మూత్ర పరీక్షలు, ఖరీదైన స్కానింగ్‌ల పేరిట వేల రూపాయల బిల్లులు వేస్తూ రోగులను కోలుకోలేని దెబ్బతీస్తున్నారు. తాజాగా నగరంలో వెలుగుచూసిన ఒక సంఘటన ఈ మెడికల్ మాఫియా దందాను స్పష్టం చేస్తోంది. తీవ్రమైన నడుము నొప్పి, మూత్రంలో మంటతో బాధపడుతున్న ఓ బాధితుడు స్థానిక ఆర్ఎంపీ సలహాతో రూ.1,000 వెచ్చించి స్వచ్ఛందంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకున్నాడు. ఆ రిపోర్టుతో ఫిజిషియన్ వద్దకు వెళ్లగా.. అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లో వివరాలు స్పష్టంగా లేవని, సిటీ (జు) స్కాన్ చేయించుకోవాలని డాక్టర్ సూచిస్తూ దానికి అయ్యే వ్యయాన్ని కూడా చిట్టీపై రాశారు. అదే వ్యక్తి నేరుగా వెళ్తే స్పష్టమైన రిపోర్ట్ ఇవ్వని స్కానింగ్ సెంటర్, డాక్టర్ రాసిన చిట్టీ తీసుకెళ్లగానే రూ. 3,500 నుండి రూ. 5,000 వరకు వసూలు చేసి వెంటనే సీటీ స్కాన్ రిపోర్టు ఇవ్వడం వారి దోపిడీ వైఖరికి అద్దం పడుతోంది. పరీక్షలు, స్కానింగ్‌ల పేరుతో రోగుల నుంచి వచ్చే మొత్తంలో డాక్టర్లకు 20 నుండి 40 శాతం వరకు కమిషన్లు ముడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రజాధనంతో ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల అత్యాధునిక వసతులు కల్పిస్తున్నామని ప్రకటనలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో ప్రైవేటు హాస్పిటళ్లు, ల్యాబ్‌ల అక్రమాలపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు కనీస తనిఖీలు చేపట్టడం లేదని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# ఖాదర్ బాబా సతీమణి ఆరోగ్య పరిస్థితిపై ఆరా

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా సత్తుపల్లికి పట్టణానికి చెందిన ఆంధ్రప్రభ సీనియర్ పాత్రికేయులు ఖాదర్ బాబా సతీమణి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని విషయం తెలుసుకొని సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లి ఖాదర్ బాబా కలిసి వారి సతీమణి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తేళ్ల రమేష్, కర్రి కమలాకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో 15న పెన్షన్ అదాలత్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రిటైర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సత్తుపల్లి ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం (15వ తేదీ) పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం తెలిపింది. సీఎం పీఎఫ్ కమిషనర్ ఆధ్వర్యంలో ట్రైపార్టైట్ సీఎం పీఎఫ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంతో పాటు పెన్షన్ అదాలత్‌ను ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొంది. రిటైర్ కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ పెన్షన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని సింగరేణి సత్తుపల్లి ఏరియా యాజమాన్యం కోరింది.

# వైభవంగా పురాణవాచకం కార్యక్రమం



**ఉద్యమ కెరటం, డోంగ్లీ :** కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం మధన్ హిప్పరగా గ్రామంలో నిర్వహిస్తున్న 'పురాణవాచకం' (పురాణ ప్రవచనం) కార్యక్రమం భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య వైభవంగా ముగిసింది. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని గ్రామంలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు శివలీలామృత మహాపురాణ పారాయణాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పురాణ వాచకులు శంకర్ రావు, కుశాల్ రావులు శివుని లీలలు, జ్యోతిర్లింగాల మహిమలు, ఇతిహాసాల్లోని ధర్మ సందేశాలను భక్తులకు వివరంగా బోధించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సేవలందించిన పురాణ వాచకులు శంకర్ రావు, కుశాల్ రావులను మధన్ హిప్పరగా గ్రామ సర్పంచ్ బాచావార్ లక్ష్మణ్ పటేల్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఇటువంటి పురాణ పఠనాలు నిర్వహించడం వల్ల ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడమే కాకుండా, గ్రామ ప్రజల్లో సద్భావన పెరుగుతుందన్నారు. శ్రావణమాసంలో సూర్యోదయానికి ముందే బ్రాహ్మీ ముహూర్త స్నానాలు ఆచరించి, పవిత్ర బిల్వపత్రాలు, పంచామృతాలతో శివాభిషేకం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని పండితులు పేర్కొన్నారు. ఈ పురాణ శ్రవణ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ప్రజలందరికీ చవితి శుభాకాంక్షలు



**ఉద్యమ కెరటం, హుజురాబాద్, కరీంనగర్:** సకల విఘ్నాలు తొలగించే వినాయకుడు ప్రతి ఒక్కరి ఇంట్లో సంతోషాలు నింపాలని,ఎల్ నినో ప్రభావం తొలిగి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్టు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నాడు ఆయన కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. వినాయక మండపాల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్,ఇతర వాటిల్లో జాగ్రత్తగా ఉండాలని నిర్వాహకులను కోరారు.

# గణనాథునికి ఎమ్మెల్సీ పూజలు

ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్: పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా ఎమ్మెల్సీ దండే విఠల్ఆ ధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గణనాథునికి పూజలు చేసి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, మాజీ చైర్మన్ దస్తగిరి, కౌన్సిలర్లు సిద్ధం రాజేశ్వరి శ్రీనివాస్, కచ్చకాయల జ్యోతి, ఎమ్మాజీ శారద సంతోష్, కాంగ్రెస్ నాయకులు శ్యామ్ రావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# హైదరాబాద్ హార్స్ షో విజేతగా నజుముద్దీన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** నాసర్ పోలో అండ్ ఈక్వెస్ట్రియన్ అకాడమీ వేదికగా జరిగిన హైదరాబాద్ హార్స్ షోలో యువ ఈక్వెస్ట్రియన్లు మీర్ నజుముద్దీన్ అజమ్, మహ్మద్ ఆమిర్ షానవాజ్ సత్తాచాటారు. నాసర్ అకాడమీలో శిక్షణ పొందుతున్న నజుముద్దీన్.. 'బెలిజ్ ఫాంగ్' గుర్రంపై స్వారీ చేస్తూ ప్రతిష్టాత్మక 105-110 సెంటిమీటర్ల ఓపెన్ షో జంపింగ్ విభాగంలో విజేతగా నిలిచాడు. దీంతోపాటు 105-1210 సెం. మీ అండర్ -14, 60 సెం.మీ విభాగాల్లోనూ మూడు రజతాలతో మెరిశాడు. కొవై స్టేబుల్స్‌కు చెందిన ఆమిర్.. 'డార్సీ' గుర్రంతో 80-90 సెం.మీ., అండర్-14 జంపింగ్ కేటగిరీలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. నాసర్ అకాడమీకే చెందిన ఐజా మీర్ 'క్విబెల్లే' గుర్రంపై 105-110 సెం.మీ అండర్ -14 విభాగంలో ప్రథమ స్థానంలో నిలువగా అమైరా కంచర్ల 'దుబాయ్ స్కైలైన్' గుర్రంతో హ్యాక్స్ అండర్-14 డ్రెసేజ్ ట్రాట్ విభాగాల్లో విజేతగా నిలిచింది.

# భారత క్రికెట్ గర్వపడే క్షణాలు..

- ఆసియా కప్ మనదే.. అమ్మాయిల అద్భుతం!
- శ్రీలంకపై 72 పరుగులతో భారత్ ఘనవిజయం
- రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఆసియా కప్ కైవసం
- షఫాలీ-స్మృతి 129 పరుగుల భారీ భాగస్వామ్యం
- నాలుగు వికెట్లతో శ్రీ చరణి విజృంభణ
- 'భారత క్రికెట్ గర్వపడే క్షణాలు' అంటూ మోదీ ప్రశంస





**దుబాయ్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** మహిళల ఆసియా కప్--2026లో భారత జట్టు అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఆదివారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో శ్రీలంకను 72 పరుగుల తేడాతో ఓడించి రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది. భారత మహిళల జట్టు విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. "భారత క్రికెట్ గర్వపడే క్షణాలు ఇవి" అంటూ జట్టుకు అభినందనలు తెలిపారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని.. టోర్నీ ఆసాంతం భారత జట్టు ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం, నిలకడ, స్ఫూర్తిదాయకమైన ఆటతీరును కొనియాడారు. ఆసియా కప్‌ను సొంతం చేసుకోవడం అద్భుతమని పేర్కొన్నారు. ఈ విజయం దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువ క్రికెటర్లకు స్ఫూర్తినిస్తుందని, భవిష్యత్తులో మరింత మంది యువత దేశం తరఫున క్రికెట్ ఆడేందుకు ముందుకు వస్తారని ఆకాంక్షించారు. ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 183 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన తొలి వికెట్‌కు ఏకంగా 129 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారీ స్కోరుకు పునాది వేశారు. షఫాలీ 39 బంతుల్లో 68 పరుగులు చేయగా.. స్మృతి అదే 39 బంతుల్లో 59 పరుగులతో ఆకట్టుకుంది. అయితే చివరి ఓవర్లలో శ్రీలంక బౌలర్లు పుంజుకున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 14 పరుగులకే వెనుదిరగగా, రిచా ఘోష్ 17 పరుగులు చేసింది. టోర్నీలో తొలిసారి బరిలోకి దిగిన జీ. కమలిని చివర్లో మెరుపులు మెరిపించింది. కేవలం ఐదు బంతుల్లో 15 పరుగులు చేయడంతో భారత్ స్కోరు 183కు చేరింది. 184 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. శ్రీ చరణి అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు వికెట్లు పడగొట్టింది. దీప్తి శర్మ కూడా కీలక వికెట్లు తీసి లంక బ్యాటింగ్ పతనంలో ప్రధాన పాత్ర పోషించింది. భారత బౌలర్ల ధాటికి శ్రీలంక 20 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్ 72 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి ఆసియా కప్‌ను ముద్దాడింది.

### 2024 ఓటమికి బదులు

ఈ విజయంతో 2024 ఆసియా కప్ ఫైనల్‌లో శ్రీలంక చేతిలో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకున్నట్లయింది. మహిళల ఆసియా కప్‌ను భారత్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి సొంతం చేసుకోగా.. ఫైనల్స్‌లో శ్రీలంకపై భారత్‌కు ఇది ఆరో విజయం కావడం మరో విశేషం.



# నేనేం తప్పు చేశా?

## వైభవ్‌కు బెంచ్ షాక్!

### సూర్యవంశీని పక్కనపెట్టడంపై కైఫ్ ప్రశ్నలు

### ఫామ్‌లో లేకున్నా శాంసన్‌కు చోటెలా అంటూ నిలదీత

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** "జింబాబ్వేలో పరుగుల వరద పారించా.. సిరీస్‌లో అత్యుత్తమ ఆటగాడిగా నిలిచా.. అయినా నాకెందుకు అవకాశం లేదు? నేనేం తప్పు చేశా?" యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మనసులో ఇలాంటి ప్రశ్నే మెదులుతుందని భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డారు. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన తొలి టీ20లో వైభవ్‌ను పక్కనపెట్టి సంజు శాంసన్‌కు తుది జట్టులో అవకాశం కల్పించడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్‌కు ఏడు వికెట్ల తేడాతో విజయాన్ని అందించినప్పటికీ.. శాంసన్ వైఫల్యం, ఫామ్‌లో ఉన్న వైభవ్‌ను బెంచ్‌కే పరిమితం చేయడం చర్చకు దారితీసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన శాంసన్ ఎనిమిది బంతుల్లో రెండు ఫోర్లతో 10 పరుగులకే వెనుదిరిగారు. టీ20 ప్రపంచకప్ తర్వాత ఆడిన గత ఐదు మ్యాచ్‌ల్లో ఒక్కసారి కూడా 30 పరుగుల మార్కును చేరుకోలేకపోయారని కైఫ్ గుర్తుచేశారు. జట్టు నుంచి తప్పుకున్న తర్వాత దేశవాళీ లేదా ఇతర పోటీల్లో ఆడి తిరిగి ఫామ్‌ను నిరూపించుకోకుండానే శాంసన్‌కు తుది జట్టులో ఎలా అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు. మరోవైపు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఇటీవల అద్భుత ఫామ్‌లో ఉన్నారని కైఫ్ పేర్కొన్నారు. జింబాబ్వే పర్యటనలో మూడు మ్యాచ్‌ల్లో 151 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచిన విషయాన్ని ప్రస్తావించారు. ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్‌కు వైభవ్‌ను ఎంపిక చేసినప్పటికీ తుది జట్టులో మాత్రం శాంసన్ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గుచూపింది. "జింబాబ్వేలో బాగా ఆడాను.. జట్టుకు విజయాలు అందించాను.. అయినా నన్నెందుకు ఆడించలేదు?" అని వైభవ్ ప్రశ్నించుకుంటే అందులో తప్పేమీ లేదని కైఫ్ అభిప్రాయపడ్డారు. భారత జట్టు సరైన ఓపెనింగ్ జోడీ విషయంలో కొంత గందరగోళంలో ఉన్నట్లు కనిపిస్తోందని కైఫ్ విశ్లేషించారు. అభిషేక్ శర్మ, సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీల్లో ఎవరిని ఓపెనర్లుగా కొనసాగించాలన్న దానిపై స్పష్టత అవసరమన్నారు. తొలి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించినా.. మంచి ఫామ్‌లో ఉన్న యువ ఆటగాడిని పక్కనపెట్టి పరుగుల కోసం ఇబ్బంది పడుతున్న సీనియర్‌కు అవకాశం ఇవ్వడంపై ప్రశ్నలు మాత్రం ఆగడం లేదు. రాబోయే మ్యాచ్‌ల్లో వైభవ్‌కు అవకాశం కల్పిస్తారా? శాంసన్‌నే కొనసాగిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# బీసీసీఐలో మార్పునకు ఇదే సమయం!

- దిగ్గజాల సేవలు ఉపయోగించుకోవాలన్న గావస్కర్
- సచిన్, ద్రవిడ్, గంగూలీలతో ప్రత్యేక కమిటీకి ప్రతిపాదన
- దేశవాళీ క్రికెట్‌పైనా కీలక నిర్ణయాలు తీసుకోవాలని సూచన
- సలహా కమిటీ పరిధిని మరింత విస్తరించాలని అభిప్రాయం
- మహిళల క్రికెట్‌కూ ప్రత్యేక కమిటీ ఉండాలని సూచన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** భారత క్రికెట్ నియంత్రణ మండలిలో కీలక మార్పులు తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైందని భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డాడు. భారత క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అపార అనుభవం ఉన్న మాజీ క్రికెటర్ల సేవలను ఉపయోగించుకోవాలని సూచించాడు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సౌరభ్ గంగూలీ, రవిశాస్త్రి, అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి దిగ్గజాలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాడు. ఇటీవల దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ వ్యవహరించిన తీరుపై గావస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన ఆధిక్యం ఆధారంగా ఈస్ట్ జోన్ టైటిల్‌ను సొంతం చేసుకున్న నేపథ్యంలో దేశవాళీ క్రికెట్ నిబంధనలు, వ్యవస్థతోపాటు బీసీసీఐలోనూ మరింత విస్తృతమైన ఆలోచన అవసరమని పేర్కొన్నాడు.

### గతంలో కీలక మార్పులు చేశాం

తాను బీసీసీఐ సాంకేతిక కమిటీ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్న విషయాన్ని గావస్కర్ గుర్తుచేశాడు. రంజీ ట్రోఫీలో జోనల్ విధానాన్ని తొలగించి ఎలైట్, ప్లేట్ టోర్నీలను ప్రవేశపెట్టామని తెలిపాడు. దీనివల్ల ఆటగాళ్లు సొంత జోన్‌కే పరిమితం కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలు, భిన్న వాతావరణ పరిస్థితుల్లో ఆడే అనుభవాన్ని పొందారని వివరించాడు. పాయింట్ల విధానంలోనూ మార్పులు తీసుకొచ్చామని తెలిపాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యానికి ఒక పాయింట్, మ్యాచ్‌లో నేరుగా విజయం సాధిస్తే రెండు పాయింట్లు ఇచ్చే విధానాన్ని తీసుకొచ్చామని, అదనపు బోనస్ పాయింట్లను తొలగించామని పేర్కొన్నాడు.

### దిగ్గజాలందరినీ ఒకే వేదికపైకి

ప్రస్తుతం బీసీసీఐలో సెలెక్షన్ కమిటీలు, క్రికెట్ సలహా కమిటీ మినహా పెద్దగా కమిటీలు లేవని గావస్కర్ పేర్కొన్నాడు. క్రికెట్ సలహా కమిటీ పరిధిని విస్తరించి కేవలం సెలెక్టర్లు, కోచ్‌ల ఎంపికకే పరిమితం చేయకుండా దేశవాళీ, అంతర్జాతీయ షెడ్యూళ్లతోపాటు భారత క్రికెట్‌కు సంబంధించిన కీలక అంశాలపైనా నిర్ణయాలు తీసుకునేలా తీర్చిదిద్దాలని సూచించాడు. "మనకు అత్యంత అనుభవం ఉన్న మాజీ క్రికెటర్లు ఎంతోమంది ఉన్నారు. వారి నైపుణ్యాన్ని ఉపయోగించుకోవాలి. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సౌరభ్ గంగూలీ, రవిశాస్త్రి, అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్ వంటి వారిని ఒకే కమిటీలోకి తీసుకొస్తే ఎలా ఉంటుంది?" అని గావస్కర్ ప్రతిపాదించాడు. బీసీసీఐ అధ్యక్షుడు, కార్యదర్శి కూడా ఈ కమిటీలో భాగస్వాములుగా ఉండాలని సూచించాడు.

### కోచ్.. కెప్టెన్‌తోనూ చర్చలు

ఈ కమిటీ భారత జట్టు కోచ్, కెప్టెన్, జాతీయ క్రికెట్ అకాడమీ అధిపతితో ఎప్పటికప్పుడు చర్చలు జరిపితే తీసుకునే నిర్ణయాలకు మరింత బలం చేకూరుతుందని గావస్కర్ అభిప్రాయపడ్డాడు. అనుభవం, నైపుణ్యం కలిగిన దిగ్గజాలు కలిసి భారత క్రికెట్ భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకుంటే అద్భుత ఫలితాలు వస్తాయని పేర్కొన్నాడు. మహిళల క్రికెట్‌కు కూడా ఇదే తరహాలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని గావస్కర్ సూచించాడు. మహిళల క్రికెట్ అభివృద్ధికి అనుభవజ్ఞులైన మాజీ క్రీడాకారిణుల సేవలను వినియోగించుకోవాలని అభిప్రాయపడ్డాడు. "ఇలాంటి కమిటీ గురించి ఆలోచిస్తేనే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఇది ఎప్పటికైనా నిజమవుతుందా? లేక కేవలం కలగానే మిగిలిపోతుందా?" అంటూ గావస్కర్ తన ప్రతిపాదనను ముగించాడు.

# చెడ్డ బంతికి వికెట్ వస్తే ఆనందించను

- కారణం చెప్పిన వరుణ్ చక్రవర్తి
- ఫలితం కంటే బౌలింగ్ ప్రాసెస్ (ప్రక్రియ) పైనే నా దృష్టి; 35 ఏళ్ల స్టార్ స్పిన్నర్ స్పష్టత
- అఫ్ఘానిస్తాన్‌తో తొలి టీ20లో 16 పరుగులే ఇచ్చి ఒక వికెట్ తీసి ఆకట్టుకున్న వరుణ్
- ఇంగ్లాండ్ పర్యటన నిరాశపరిచినా ఎంతో నేర్చుకున్నానని వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** భారత స్టార్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన కెరీర్‌లో ఎదురయ్యే హెచ్చుతగ్గుల వేళ 'ఫలితాల' కంటే కూడా బౌలింగ్ 'ప్రక్రియ (ప్రాసెస్)'కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా అఫ్గానిస్తాన్‌తో జరిగిన తొలి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో వరుణ్ అద్భుతంగా బౌలింగ్ చేసి కేవలం 16 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన తన క్రికెట్ ప్రయాణం, విమర్శలను తట్టుకునే వైఖరి గురించి మాట్లాడారు. తన 49 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల కెరీర్‌లో 75 వికెట్లు పడగొట్టిన వరుణ్, కేవలం వికెట్ల సంఖ్యతోనే ఒక ఆటగాడి ప్రతిభను అంచనా వేయలేమని అన్నారు. "ఒక మంచి బంతికి వికెట్ రాకపోయినా బాధపడను.. అలాగే ఒక చెడ్డ బంతికి అదృష్టవశాత్తు వికెట్ లభిస్తే దానికి ఆనందించను. వెంటనే ఆ తప్పును సరిదిద్దుకునేందుకే ప్రయత్నిస్తాను" అని తెలిపారు. ఫలితాలపై అతిగా ఆలోచిస్తే మానసిక ఒత్తిడి పెరుగుతుందని, సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేయడమే తన చేతుల్లో ఉందన్నారు. ఇంగ్లాండ్ పర్యటన గాయం వల్ల అర్ధాంతరంగా ముగిసినప్పటికీ, ఆ పర్యటన నుంచి భవిష్యత్తుకు అవసరమైన విలువైన పాఠాలు



నేర్చుకున్నానని ఆయన వెల్లడించారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
15 సెప్టెంబర్ 2026



# హిట్ వచ్చింది కానీ.. ఆఫర్స్ మాత్రం లేవు..

## గ్లామర్ బ్యూటీ కేతిక శర్మ పరిస్థితి

**హైదరాబాద్:** కెరీర్ ప్రారంభించిన నాలుగేళ్ల తర్వాత తొలి హిట్ ముఖం చూసిన గ్లామర్ బ్యూటీ కేతిక శర్మకు, విజయం సాధించినా అవకాశాలు మాత్రం తలుపు తట్టడం లేదు. ఆకాష్ పూరి సరసన 'రొమాంటిక్' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ, ఆ తర్వాత వరుస ఫ్లాపులను ఎదుర్కొంది. మెగా హీరోలు సాయి ధరమ్ తేజ్ ('బ్రో'), వైష్ణవ్ తేజ్ ('రంగ రంగ వైభవంగా')లతో సినిమాలు చేసినప్పటికీ ఆమె ఫేట్ మారలేదు. ఫలితంగా కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆ గ్యాప్ తర్వాత హీరో శ్రీవిష్ణు సరసన నటించిన 'సింగిల్' సినిమా గతేడాది సమ్మర్‌లో విడుదలై కేతిక కెరీర్‌లో తొలి విజయాన్ని అందించింది. ఫ్లాపుల్లో ఉన్నప్పుడు వచ్చిన ఆఫర్లు, హిట్ వచ్చాక రాకపోవడంతో కేతిక తీవ్ర నిరాశకు గురవుతోంది. నితిన్ 'రాబిన్ హుడ్' చిత్రంలో చేసిన ప్రత్యేక గీతం (ఐటమ్ సాంగ్) కూడా ఆమెకు కొత్త ప్రాజెక్టులను తెచ్చిపెట్టలేకపోయింది. దీంతో టాలీవుడ్‌ను పక్కనపెట్టి తమిళ చిత్రసీమ (కోలీవుడ్) వైపు దృష్టి సారించింది. హిప్ హాప్ తమిళ ఆది కథానాయకుడిగా నటిస్తున్న 'మీసాయ మురుక్కు 2' చిత్రం ద్వారా కోలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. సెప్టెంబర్ 25న విడుదల కానున్న ఈ సినిమాతోనైనా తమిళ తంబీలను ఆకట్టుకుని మళ్లీ బిజీ హీరోయిన్‌గా మారుతుందో లేదో వేచి చూడాలి.





# ఆనంద్‌తో ప్రేమా?.. అలాంటిదేమీ లేదు!

## పెళ్లి రూమర్లకు వైష్ణవి చైతన్య చెక్

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** ఇండస్ట్రీలో హీరో హీరోయిన్లు కలిసి ఒకటి రెండు సినిమాలు చేశారంటే చాలు.. వారి మధ్య ఏదో నడుస్తోందంటూ గుసగుసలు మొదలవడం సర్వసాధారణం. డేటింగ్, లవ్‌లో ఉన్నారంటూ పుట్టుకొచ్చే రూమర్లు కొన్నాళ్లపాటు నెట్టింట తెగ హల్‌చల్ చేస్తుంటాయి. తాజాగా ఎన్టీవీ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరోయిన్ వైష్ణవి చైతన్య.. తన కో-స్టార్ ఆనంద్ దేవరకొండతో రిలేషన్‌షిప్‌పై వస్తున్న వార్తలకు, పెళ్లి రూమర్లకు ఒక్కసారిగా ఫుల్‌స్టాప్ పెట్టారు. ఆనంద్ దేవరకొండతో ప్రేమాయణం నడుపుతున్నారంటూ వస్తున్న వార్తలపై ఈ ఇంటర్వ్యూలో యాంకర్ ప్రశ్నించగా వైష్ణవి నిర్మొహమాటంగా స్పందించారు. "మా ఇద్దరి మధ్య ఎలాంటి రిలేషన్‌షిప్ లేదు. మేమిద్దరం కేవలం కో-స్టార్స్, మంచి ఫ్రెండ్స్ మాత్రమే. మా మధ్య దాదాపు కొన్నేళ్లుగా మంచి ట్రావెల్ ఉంది. బయట వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదు" అని కుండబద్దలు కొట్టారు. అంతేకాకుండా, ఆనంద్ రెండు - మూడేళ్లలో పెళ్లి చేసుకునే ఆలోచనలో ఉన్నాడని, తన పెళ్లికి ఇంకా చాలా టైం ఉందని చెబుతూ, తమ బంధంపై వస్తున్న ఊహాగానాలను పూర్తిగా కొట్టిపారేశారు. జీవితంలో ఎదురయ్యే సంక్లిష్ట పరిస్థితులను ఎలా దాటాలనే అంశంపై ఆమె స్పందిస్తూ.. "ఎలాంటి గడ్డు పరిస్థితి వచ్చినా దాన్ని అంగీకరించడం, ఓర్పు వహించడం, ఆశతో ముందడుగు వేయడం చాలా ముఖ్యం. మనల్ని మనం నమ్ముకుంటూ ప్రశాంతంగా ఉంటే ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులనైనా అధిగమించవచ్చు" అన్నారు. తన అందం, లైఫ్ స్టైల్ గురించి మాట్లాడుతూ.. వర్కవుట్లు అంటే తనకు ఎంతో ఇష్టమని, అయితే ఫుడ్ విషయంలో పెద్దగా కఠినంగా ఉండనని అన్నారు. చికెన్, ఎగ్స్‌తో పాటు స్వీట్స్ కూడా ఇష్టంగా తింటానని, తనకు నచ్చిన ఫుడ్ తింటూనే వర్కవుట్స్‌తో ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటానని చెప్పుకొచ్చారు. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ ముందుకు సాగుతున్న ఈ భామ, పెళ్లి రూమర్లను సున్నితంగా కొట్టిపారేసిన విధానం ఇప్పుడు నెటిజన్లను, సినీ ప్రియులను అమితంగా ఆకట్టుకుంటోంది.



# ఎన్నాళ్లకెన్నాళ్లకు..

## శ్రియా శరణ్ సినిమా రిలీజ్‌కు రెడీ!

**చెన్నై, సెప్టెంబర్ 14 (ఉద్యమ కెరటం):** తెలుగుతో పాటు పాన్ ఇండియా స్థాయిలో విశేష ఆదరణ పొందిన కథానాయిక శ్రియా శరణ్ నటించిన తమిళ చిత్రం 'సండకారి' ఎట్టకేలకు థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. తమిళ నటుడు వేమల్, శ్రియా కాంబినేషన్‌లో రొమాంటిక్ కామెడీ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి ఆర్. మధేష్ దర్శకత్వం వహించారు. బాస్ ప్రొడక్షన్ కార్పొరేషన్ బ్యానర్‌పై 2019లోనే ఈ చిత్రాన్ని నిర్మించగా, పలు సాంకేతిక కారణాల వల్ల విడుదల వాయిదా పడుతూ వచ్చింది. చిత్రసీమలో అరుదైన రీతిలో, ఈ సినిమా థియేటర్లలో విడుదల కాకుండానే 2020 సంవత్సరానికి గాను 'తమిళనాడు స్టేట్ ఫిల్మ్ అవార్డ్స్'లో మూడు ప్రధాన పురస్కారాలను గెలుచుకుని సంచలనం సృష్టించింది. ఉత్తమ చిత్రం కేటగిరీలో మూడో బహుమతితో పాటు బెస్ట్ మేల్ ప్లేబ్యాక్ సింగర్ (అమ్రిష్), బెస్ట్ ఆర్ట్ డైరెక్టర్ (అయ్యప్పన్) అవార్డులను కైవసం చేసుకుంది. 2012లో మలయాళంలో ఘనవిజయం సాధించిన 'మై బాస్' చిత్రానికి అధికారిక రీమేక్‌గా వచ్చిన ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో ప్రభు, దేవ్ గిల్, సత్యన్, రేఖ ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు.









Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717